క్లుప్తంగా

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు



టి.రాయవరంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ప్రత్తిపాడు: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని టి.రాయవరం సత్తెమ్మతల్లి ఆలయంలో పార్టీ నాయకులు, ముద్రగడ అభిమానులు విశేష పూజలు నిర్వహించారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి ముద్రగడ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తటవర్తి రామన్నదొర, మాజీ సొసైటీ డైరెక్టర్ బత్తుల నాగార్జున, మాజీ ఉప సర్పంచ్ కొండి శ్రీను, పార్టీ నాయకులు మేరా రాఘవ, మొక్కపాటి సత్యనారాయణ, బత్తుల వెంకటేష్, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు తెల్లవారుజామున స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నందనవనంలో విశేష పూజలు

రౌతులపూడి: మండలంలోని శృంగవరం–మెరక చామవరం సమీపంలోని నందనవనంలో వెలసిన ఉమావర్ధిని నాగలింగేశ్వరస్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు తెల్లవారుజామున స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక ఎంపీటీ సభ్యుడు గాది రాజుబాబు, అనంతలక్ష్మి దంపతులు ఆర్థిక సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కిర్లంపూడి: ప్రత్తిపాడు–కిర్లంపూడి ప్రధాన రహదారిపై సోమవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే...లంపకలోవకు చెందిన కారు కిర్లంపూడి నుంచి ప్రత్తిపాడు వైపు వెళుతోంది. కారు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తికి కునురెప్ప పడడంతో ఎదురుగా వస్తున్న కారు, లోడు ఆటోను ఢీకొట్టాడు. వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నమూనా ఆలయం వద్ద లారీ బోల్తా



లారీ బోల్తా పడటంతో రోడ్డుమీద పడిన ఆగాకరకాయలు

అన్నవరం: జాతీయరహదారిపై స్థానిక సత్యదేవుని నమూనా ఆలయం వద్ద సోమవారం సాయంత్రం లారీ బోల్తా పడింది. నర్సీపట్నం నుంచి ఖమ్మం ఆగాకర కాయల లోడుతో వెడుతున్న లారీ నమూనా ఆలయం వద్దకు వచ్చాక డ్రైవర్ లారీని పక్కకు పెట్టేందుకు ప్రయత్నిస్తుండగా లారీ ఒక్కసారిగా ఒరిగిపోయింది. ఆగాకర కాయలు రోడ్డు మీద చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు

కోటనందూరు: యువతి అదృశ్యమైన ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై టి.రామకృష్ణ సోమవారం తెలిపారు. వివరాల్లోకెళితే.. కోటనందూరుకి చెందిన పాటనూరి కావ్యశ్రీ (19) ఈనెల 9 ఉదయం ఇంటి నుంచి మెడికల్ షాపునకు వెళ్లి తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినా కావ్యశ్రీ ఆచూకీ లభించలేదు. దీంతో యువతి సోదరుడు పాటనూరి గోవిందు ఆదివారం రాత్రి పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. కావ్యశ్రీ మొబైల్ వాట్సాప్‌ను పరిశీలించి నర్సీపట్నానికి చెందిన మాధవ గణేష్ తన సోదరి అదృశ్యానికి కారణమై ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

రౌతులపూడి: మండలంలోని గిడజాంలో పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు రౌతులపూడి ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. నిందితుల నుంచి రూ.23,500, కారు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట, గుండాట వంటి జూద క్రీడలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎరువుల కొరత..రైతుకు వెత

- గగ్గోలు పెడుతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- మరోవైపు సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు



లింగంపర్తి సొసైటీ కార్యాలయం వద్ద ఎరువుల కోసం క్యూకట్టిన రైతులు



ట్రాక్టర్ల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: 'ఊరంతా పిండి కొడుతుంటే కోతి నెత్తి కొట్టుకుందంట' అన్నట్టుగా ఉంది టీడీపీ నేతల పరిస్థితి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క టీడీపీ నేతలు విజయోత్సమంటూ ట్రాక్టర్లతో ర్యాలీ చేయడంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు దాటింది. ప్రస్తుతం సాగు నారుమళ్ల దశలో ఉండడంతో రైతులకు యూరియా, ఇతర ఎరువులు అవసరమయ్యాయి. నారుమళ్లకు గడ్డిమందుతో కలిపి యూరియాను చల్లాలి. ప్రస్తుతం యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఫెర్టిలైజర్స్ షాపులు, సొసైటీ కార్యాలయాల వద్ద యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. ప్రస్తుతం నారుమళ్లకు యూరియా అత్యవసరం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

24 వేల ఎకరాల్లో సాగు

నియోజకవర్గంలో 24 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టగా ఎరువులు 1838 టన్నులు కావల్సి ఉండగా ప్రస్తుతం 678 టన్నులు అందుబాటులో ఉన్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల పరిస్థితి ఇలా ఉంటే టీడీపీ నేతల పరిస్థితి మరోలా ఉంది.

రైతుల విజయోత్సవం పేరిట ర్యాలీ

ఎరువుల అందుబాటులో లేకపోవడంతో ఇప్పటికే వేసిన వరినాట్ల పరిస్థితి ఎలా ఉంటోదనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క టీడీపీ శ్రేణులు అన్నదాత సుఖీభవ అమలు చేశారంటూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో రైతుల పేరిట ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రైతుల పరిస్థితి అర్థం చేసుకోకుండా ప్రచారం కోసం రైతులను బలవంతంగా రప్పించి ట్రాక్టర్లతో ర్యాలీ చేయడం చర్చనీయాంశమైంది. రైతులకు తగిన ఎరువులు అందుబాటులో ఉంచకుండా ర్యాలీలు చేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

యూరియా మరింత అవసరం

ఖరీఫ్ సీజన్‌కు అత్యంత అవసరమైన ఎరువుగా యూరియాను రైతులు పరిగణిస్తారు. ప్రస్తుతం గడ్డి మందుతో కలిపి యూరియా వేయవల్సి ఉండగా రాబోయే రోజుల్లో డీఏపీ, 2020, 2828తో కలిపి వేయాలి. ఎకరానికి రూ.25 కేజీల చొప్పున యూరియా అవసరమవుతుంది. ఇప్పుడే యూరియా అందుబాటులో లేకపోతే భవిష్యత్‌లో తమ పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా, సొసైటీల, ఎరువుల దుకాణాల ద్వారా ఖరీఫ్ సాగుకు ముందే ఎరువులు అందుబాటులో ఉండేవని రైతులు పేర్కొంటున్నారు.

టీడీపీ నాయకుల సిఫారసులు

సొసైటీల ద్వారా విక్రయిస్తున్న యూరియాను టీడీపీ నాయకుల రికమండేషన్‌తో ఒక బస్తా అదనంగా ఇస్తున్నారు. రైతుల విషయంతో టీడీపీ నాయకుల జోక్యంపై విమర్శలు వస్తున్నాయి. అలాగే యూరియా ధర రూ.290 కాగా బ్లాక్‌లో రూ.300 నుంచి రూ.350కు విక్రయిస్తున్నారు. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి



ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు యూరియాను అందుబాటులో ఉంచాలి. ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే రైతుల పరిస్థితి అర్థం చేసుకొని యూరియాను అందించాలి.

–అల్లం ఆదినారాయణ, రైతు సిరిపురం

ఉన్నతాధికారులకు నివేదించాం

ఎరువుల కొరతపై ఉన్నతాధికారులకు నివేదించాం. రెండు మూడు రోజుల్లో ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

– ఎస్.నరసింహం, ఇన్‌చార్జ్ మండల వ్యవసాయాధికారి, ఏలేశ్వరం

తొండంగి తహసీల్దార్‌గా కాంతారావు



తొండంగి: మండల తహసీల్దార్‌గా కాంతారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. పెద్దాపురం తహసీల్దార్‌గా ఉన్న ఆయనను ప్రభుత్వం తొండంగికి బదిలీ చేసింది. గతంలో తహసీల్దార్‌గా ఉన్న మురార్జీ ఉద్యోగ విరమణ చేయడంతో తుని తహసీల్దార్ ప్రసాద్‌కు ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో పెద్దాపురం రిలీవ్ అయిన కాంతారావు తొండంగి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టడంతో డిప్యూటీ తహసీల్దార్ వీరేష్, ఆర్ఐ రాజారావు, వీఆర్వోలు, విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది కాంతారావుకు అభినందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

శంఖవరం: డెంగీ వ్యాధి అత్యంత ప్రమాదకరమని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. ప్లేట్‌లైట్స్ తగ్గితే ప్రాణానికే ప్రమాదమన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదని, లక్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

మొక్కుబడిగా సత్రం భూముల కౌలువేలం



శృంగవృక్షంలో నాళం వారి సత్రం భూములకు కౌలువేలం నిర్వహిస్తున్న అధికారులు



పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో పోలీసుల పహారా

- గతంలో హెచ్చుపాట పాడిన రెండు బిట్లు రద్దు చేసిన అధికారులు
- 268.64 ఎకరాలకు రూ19.68 లక్షల ఆదాయం

తొండంగి: రాజమహేంద్రవరానికి చెందిన నాళం వారి సత్రం భూములకు కౌలువేలం ప్రక్రియను శృంగవృక్షంలో అధికారులు మొక్కుబడి తంతుగా నిర్వహించారు. కూటమి పార్టీ నేతల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నడుమ నిర్వహించి మమ అనిపించారు. ఏప్రిల్ నెలలో ప్రారంభమైన కౌలు వేలం వ్యవహారం పలు వాయిదాల నడుమ సోమవారం శృంగవృక్షం పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో నాళంవారి సత్రం ఈవో పీవీఎస్ఆర్ ప్రసాద్, దేవదాయ, ధర్మాదాయశాఖ పర్యవేక్షకులు ఫణికుమార్ ఇతర సిబ్బంది కౌలు వేలం ప్రక్రియ నిర్వహించారు. మొత్తంగా 268.64 ఎకరాలు భూమిని 13 బిట్లుగా కౌలువేలం నిర్వహించగా రూ.19.68 లక్షల ఆదాయం వచ్చినట్టు ఈవో ప్రసాద్ వివరించారు. గతంలో రూ.19.11 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ.57 వేలు ఆదాయం పెరిగిందన్నారు. రాజమహేంద్రవరం నాళంవారి సత్రం కార్యాలయంలో జూలై 23న నిర్వహించిన కౌలువేలంలో 27.19 ఎకరాలు బిట్టు, మరో బిట్టు 25.85 ఎకరాలకు సంబంధించి రూ.8.69 లక్షలకు వేలం ఖరారు కాగా ఇద్దరు రైతులు హెచ్చుపాటగా దక్కించుకున్నారు. సదరు రైతులు నిబంధనల ప్రకారం కౌలు సొమ్ము చెల్లించని కారణంగా ప్రథమ ధరావత్తులను రూ.లక్ష జప్తు చేసి వేలం రద్దు చేశామన్నారు. రద్దయిన బిట్లతో కలిపి 13 బిట్లకు వేలం నిర్వహించామని ఈవో తెలిపారు. ఈ భూములకు గతంలో కౌలు బకాయిలు రూ.1.20 కోట్లు ఉండగా అధికారులు కొంత మేర మాత్రమే వసూలు చేయగలిగారు. కాగా కౌలు వేలం ప్రక్రియ అంతా పిఠాపురం శ్రీసంస్థానం సత్రం భూముల కౌలు వేలం మాదిరిగానే ఎస్సై బి.జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో దాదాపుగా 20 మంది పోలీసు బందోబస్తు నడుమ నిర్వహించారు. కూటమి పార్టీ అనుకూలమైన వారిని మాత్రమే వేలం ప్రక్రియకు అనుమతినిచ్చారు. ఈ మాత్రం కౌలు వేలం కోసం రైతులను పలు మార్లు రాజమహేంద్రవరం నాళం వారి సత్రానికి రప్పించి తీవ్ర ఇబ్బందులకు గురి చేసారని సత్రం అధికారుల తీరుపై రైతులు మండిపడ్డారు.

ప్రత్తిపాడు టీడీపీలో అసంతృప్తి

సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారానికి టీడీపీ నేతల గైర్హాజరు

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు టీడీపీలో రోజురోజుకూ అసంతృప్తి పెరిగిపోతుంది. ఆవిర్భావం నుంచి పార్టీనే నమ్ముకున్న పార్టీ సీనియర్ నాయకులను కాదని ఎన్నికలకు ఎనిమిది రోజుల ముందు పార్టీలోకి వచ్చిన వారికే పార్టీలో అధిక ప్రాధాన్యం దక్కుతోందని తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఎన్నికలకు ముందు స్థానిక టీడీపీ సీనియర్ నేతలను సంప్రదించిన తర్వాతే పలువురు నేతలను టీడీపీలోకి తీసుకున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే పార్టీ కోసం ఆది నుంచి కష్టపడి పనిచేసిన వారిని కాదని కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి ఎటువంటి ప్రధాన్యం ఇచ్చేదిలేదని ఎమ్మెల్యే సత్యప్రభ పార్టీ శ్రేణులకు అప్పట్లో నచ్చజెప్పారు. ఇప్పుడు పార్టీ అధికారంలోకి వచ్చాక ఆది నుంచి వరుపుల రాజాని, పార్టీని నమ్ముకున్న తమను కాదని రాజకీయ లబ్ధి కోసం తమ పార్టీకి వచ్చిన వారికి ఎమ్మెల్యే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలుగు తమ్ముళ్లు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిల్లో రెండు మూడు గ్రూపులుగా తమ్ముళ్లు విడిపోయారు. ఈ వర్గాల్లో ఏ వర్గం ఎమ్మెల్యే సత్యప్రభ పనితీరు పట్ల సంతృప్తిగా లేరు. పార్టీకి, నియోజకవర్గానికి సంబంధంలేని ముగ్గురు వ్యక్తులే ప్రస్తుతం ఎమ్మెల్యే సత్యప్రభకు అన్నీ తామై వ్యవహరించడం నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులకు మింగుడు పడటం లేదు. ముగ్గురు వ్యక్తుల కారణంగా గతంలో రాజా వెంటే నిత్యం ఉండే కీలక వ్యక్తులు పాత్ర కూడా ప్రస్తుతం నామమాత్రమే అయిపోయింది.

ప్రమాణస్వీకారానికి టీడీపీ నేతల డుమ్మా

మండలంలోని ఒమ్మంగిలో సోమవారం సాయంత్రం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ) త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యప్రభ సమక్షంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకవర్గ చైర్మన్‌గా సత్యంశెట్టి సీతారామయ్య బాధ్యతలు స్వీకరించారు. తమను కాదని ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడాన్ని సహించలేక పార్టీ కీలక నేతలు సమావేశానికి డుమ్మా కొట్టారు. ఒమ్మంగి సొసైటీ ఆవిర్భావం నుంచి సుంకర తమ్మారావు కుటుంబమే తిరుగులేని ఆధిపత్యాన్ని దక్కించుకుంటుంది. గ్రామానికి చెందిన రామిశెట్టి సీతారామయ్య (మునసబు)ను చైర్మన్‌గా నియమించాలని కొందరు టీడీపీ కీలక నేతలు సూచించినా ఎమ్మెల్యే సత్యప్రభ లెక్కచేయకపోవడంపై టీడీపీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తీరుకు నిరసనగా స్థానిక, మండల టీడీపీ నేతలు మూకుమ్మడిగా ప్రమాణ స్వీకారానికి డుమ్మా కొట్టారు. ప్రస్తుతం సొసైటీ చైర్మన్‌గా నియమితులైన సత్యంశెట్టి సీతారామయ్య కుమారుడు జనసేనలో ఉన్నారు. లంపకలోవ సొసైటీలో భారీ అవినీతి చేశాడంటూ ఎమ్మెల్యే భర్త వరుపుల రాజాను ఇబ్బందులు పాలు చేసిన వ్యక్తి ఈ ప్రమాణ స్వీకారంలో ముందు వరుసలో ఉండటాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు.

కల్యాణ మంటపం నిర్మించాలంటూ ధర్నా



ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: పట్టణంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలంలో కల్యాణ మంటపం నిర్మించాలని సోమవారం మహిళలు ధర్నా నిర్వహించారు. స్థానిక దిబ్బలపాలెంలోని 16, 17 వార్డులకు చెందిన మహిళలు సువ్వయ్యమ్మపేటలోని ప్రభుత్వ స్థలం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ స్థలంలో గతంలో బహిరంగ మరుగుదొడ్లు ఉండగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తొలగించారన్నారు. అప్పటినుంచి స్థలం నిరుపయోగంగా ఉందన్నారు. ఈ స్థలంలో కల్యాణ మంటపం నిర్మిస్తే తమకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బూర్లు సత్తిబాబు, కంది వరలక్ష్మి, జి.మంగ, సుంకర రత్నకుమారి, మజ్జి దుర్గాదేవి, చందక అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ కాలేజీకి భవనాలు నిర్మించాలి



జగ్గంపేటలో తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న పీడీఎస్‌యూ విజృంభణ నేతలు

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కాలేజీకి భవనాలు నిర్మించాలని పీడీఎస్‌యూ నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం జగ్గంపేటలో ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఐటీఐ భవనాల నిర్మాణంపై దృష్టి సారించలేదని విమర్శించారు. 2018లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పోలవరం కాలవగట్టుపై డిగ్రీ కాలేజీ, కాపు కల్యాణ మండపం, స్టేడియం, క్రిస్టియన్ కల్యాణ మండపాలకు శంకుస్థాపనలు చేశారన్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఐటీఐ కాలేజీకి మాత్రం భవనాల నిర్మాణం చేపట్టలేదని విమర్శించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తక్షణమే స్పందించి ఐటీఐ భవనాలకు నిధులు మంజూరు చేసి నిర్మాణాలు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించాలి



రౌతులపూడిలో కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రౌతులపూడి: సహజ సిద్ధంగా పండించే ఆరోగ్యవంతమైన కూరగాయలను ప్రజలు వినియోగించుకోవాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రినర్ డి.వరలక్ష్మి సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకుకూరల స్టాల్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన ఈ స్టాల్‌ను ప్రజలంతా వినియోగించుకోవాలన్నారు. రానున్న కాలంలో మండల వ్యాప్తంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ప్రజలందరికీ ఆరోగ్యవంతమైన కూరగాయులు, చిరుధాన్యాలను అందించే దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభం ప్రతిష్ఠ



పాదురుపాకలో ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పాదురుపాక కోదండ రామాలయం వద్ద సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మురళీకృష్ణంరాజును ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీకి ఆయన రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాకా చంటిబాబు, చందక నాని, విత్తనాల నాగేశ్వరావు, గుల్లపల్లి వీరవేణి, గుల్లపల్లి రాజబాబు, గొట్టుపల్లి చిన్నోడు, గంటా గంగబాబు, సాముల బాబూరావు, దారా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

60 మందికి కంటి పరీక్షలు



జగ్గంపేటలో పెన్షనర్స్‌కు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

జగ్గంపేట: స్థానిక పెన్షనర్స్ భవనంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు తోలేటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరానికి చెందిన అకిరా కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. మొత్తం 60 మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో 14 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. వీరికి త్వరలో ఆపరేషన్లు చేయించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తామని సంఘం ప్రధాన కార్యదర్శి మంచాల మల్లేశ్వరరావు తెలిపారు. ఇకపై ప్రతినెలా పెన్షనర్స్ భవనంలో సంఘం సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు చంద్రమౌళి వెంకటశాస్త్రి, సంఘం నేతలు నాగేశ్వరరావు, డీవీడీ ప్రసాద్, రామలింగేశ్వరరావు, బుద్ధాజీ, వాకర్స్ క్లబ్ నేతలు పాల్గొన్నారు.

డీవార్మింగ్ మాత్రల పంపిణీ

తొండంగి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ గడ్డిపేట జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు సోమవారం నులిపురుగుల నివారణ (డీవార్మింగ్) మాత్రలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు చాట్రాతి వీవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం మాత్రలు అందజేశారు. రక్తహీనత కారణంగా విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు కచ్చితంగా తమ పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని సూచించారు.

22న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



ధర్మవరంలో వరలక్ష్మీ వ్రతాలపై ప్రచారం చేస్తున్న కృష్ణబాబు

ప్రత్తిపాడు/ ప్రత్తిపాడు రూరల్: అన్నవరం సత్యదేవుని సన్నిధిలో ఈ నెల 22న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు తెలిపారు. మండలంలోని ధర్మవరం, ప్రత్తిపాడు గ్రామాల్లో సోమవారం ఆయన ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 8 గంటలకు స్వామి వారి సన్నిధిలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించనున్నట్లు వివరించారు. వ్రతాల్లో పాల్గొనే భక్తులు కొబ్బరి కాయలు, అరటి పండ్లు, పువ్వులు తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భక్తులు భూలక్ష్మి, చిలకమ్మ, తలుపులమ్మ, వరలక్ష్మి, సూర్య కుమారి, గౌరీ, సుజాత తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రత్తిపాడులోని మునసబు గారి రామాలయంతో పాటు పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు.

ఉత్సాహంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

కిర్లంపూడి: గ్రామంలో సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శరకణం రాజుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజ్ఞాన భారతి ప్రైవేట్ పాఠశాల నుంచి ఏనుగువీధి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

గోకవరంలో..

గోకవరం: గ్రామంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. స్వాతంత్ర్యం సాధించి 78 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జాతీయ పతాకాలతో ర్యాలీలు నిర్వహించారు. స్థానిక గుబ్బలమ్మ ఆలయం వద్ద తిరంగా యాత్ర ప్రారంభించి మెయిన్ రోడ్డు మీదుగా గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు ఈ యాత్ర కొనసాగింది. ఈ యాత్రలో గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొని సుమారు 150 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట మంగరాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల కృష్ణవర్మ, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు సత్తి వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి కోన వెంకట సురేష్, మండల అధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర, ప్రధాన కార్యదర్శి ముప్పిడి నాగేశ్వరరావు, నాయకులు బత్తుల వెంకన్న బాబు, ఉంగరాల ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

కుండపోత

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో మండలంలోని సోమవారం సాయంత్రం కుండపోతగా కురవడంతో పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పటికీ సాయంత్రం ఆకాశం దట్టమైన మబ్బులతో మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం దాదాపుగా గంట సమయం కురిసింది. దీంతో బెండపూడి, ఏవీ నగరం, పి.అగ్రహారం, సీతారాంపురం, ఎ.కొత్తపల్లి తదితర గ్రామాల్లో శివారు ప్రాంతాల్లో పల్లపు వీధులు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా ఈదురుగాలుల ప్రభావానికి పలు చోట్ల విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మరికొద్ది రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో తీరప్రాంతంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండాలని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు.

క్రికెట్ స్టేడియం నిర్మాణానికి సన్నాహాలు

జగ్గంపేట: స్థానిక పోలవరం కాలవగట్టు సమీపంలో కొత్తగా క్రికెట్ స్టేడియం నిర్మించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, సానా సతీష్ ఫౌండేషన్ సహకారంతో స్టేడియం నిర్మాణానికి సోమవారం స్థల పరిశీలన చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, సానా సతీష్ ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, మండల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.